## క్లుప్తంగా

### కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని ఏఈవో శ్రావణ్‌కుమార్ రైతులకు సూచించారు. తాడ్వాయి మండలంలోని చిన్నదేమి శివారులో గల పంటలను శనివారం ఆయన పరిశీలించారు. పంటలో అక్కడక్కడ కత్తెర పురుగు ఉధృతి ఉందని, నివారణకు క్లోరాం ట్రానిలిప్రోల్, ఇమేమేక్టీవ్‌బెంజేట్, స్పైనోట్రం మందులను 150 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జిల్లా మలేరియా హెల్త్ అసిస్టెంట్ వైట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. దోమల నియంత్రణకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అనంతరం మలేరియా నియంత్రణ కరపత్రాలను ఆవిష్కరించారు. క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, సీహెచ్‌వో నాగరాజు, క్లబ్ ప్రతినిధులు కమలాకర్ రావు, కోతి లింబారెడ్డి, రాజేందర్, నాయకులు శ్యాం బాబు, జీపీ కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

దోమకొండ: మండల కేంద్రంలో శనివారం పద్మశాలి సంఘం మండల నూతన కార్యవర్గం ను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బత్తిని సిద్ధరాములు, ప్రధాన కార్యదర్శిగా సిరిమల్లే రాజు, కోశాధికారిగా ఎల్తొండ రవీందర్, ఉపాధ్యక్షులుగా సిరిగాద సిద్ధరాములు, సబ్బని జగదీష్, గర్దాస్ నరహరి, వంగరి ప్రకాష్, సహాయ కార్యదర్శులుగా బాలే సురేందర్, క్యాదరి రవీందర్, నాగుల ప్రసాద్, గర్దాస్ రమేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఐరేని శంకర్, బండారి శంకర్, బీసు సంతోష్‌కుమార్, సన్నిది యాదగిరి, మంగలిపెల్లి శ్రీనివాస్, అనిల్‌కుమార్, కూచని జగదీష్, శ్రీగాధ మహదేవ్, నాగుల దశరథం, అందే నాగభూషణం ఎన్నికయ్యారు.

### వాహనాల తనిఖీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని జాతీయ రహదారి యూటర్న్ వద్ద శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై పుష్పరాజ్ వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ బడుల పరిశీలన



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలలు, జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియంలను శనివారం ఎంఈవో దేవిసింగ్ పరిశీలించారు. పాఠశాలలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచాలని, ప్రారంభ పరీక్ష ఆధారంగా బోధన చేయాలని, బడి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎంలు శంకర్, హర్ష, రఫత్ సుల్తానా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన ఉండాలి



నిజాంసాగర్(జుక్కల్): పనిస్థలాల్లో మహిళలపై లైంగిక వేధింపులు కాకుండా రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని జిల్లా లింగ నిపుణరాలు తులసి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం లింగనిర్ధారణ, లైంగిక వేధింపులపై, రక్షణ చట్టాలపై వారు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రోహిత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### దోమల మందు పిచికారి



బీబీపేట: మండల కేంద్రంలోని మురికి కాలువల్లో శనివారం పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది దోమల నివారణకు మందును పిచికారీ చేశారు. కారోబార్ సిద్ధరాములు తదితరులు ఉన్నారు.

# ఆధార్ సెంటర్ తెరిచేదెన్నడు?

- లింగంపేటలో ఏడాదిన్నర కాలంగా మూతపడిన కేంద్రం
- ఆధార్ సేవల కోసం ఇతర మండలాలకు వెళ్తున్న మండల ప్రజలు
- పట్టించుకోని అధికారులు



లింగంపేటలో మూత పడిన ఆధార్ కేంద్రం

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి అనుసంధానం చేసిన ఆధార్ సెంటర్ ఏడాదిన్నర కాలంగా మూతపడడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించుకోవడానికి, నూతన ఆధార్ తీయడానికి తాడ్వాయి, ఎల్లారెడ్డి, గాంధారి, కామారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు వెళ్లాల్సివస్తుందని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా సమస్యలను అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**మండలంలో 36 గ్రామాలు..**

ప్రభుత్వం ప్రతీ తహసీల్దార్ కార్యాలయంలో నూతన ఆధార్ కార్డుల కోసం, ఆధార్ అప్‌డేషన్, డెమోగ్రాఫిక్ అప్‌డేషన్, బయోమెట్రిక్ అప్‌డేషన్, ఆధార్‌లో నెలకొన్న సమస్యలు తదితర వాటిని పరిష్కరించడానికి ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. లింగంపేట తహసీల్దార్ కార్యాలయానికి అనుసంధానంగా ఉన్న ఆధార్ కేంద్రంలో సాంకేతిక లోపం తలెత్తడంతో సేవలు నిలిపివేశారు. మండలంలో 36 గ్రామాలు, 36 తండాలతో 41 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో 47,915 ఓటర్లు, 67,000పైన జనాభా ఉన్నారు. ప్రతీరోజు ఆధార్ లింకు, పుట్టిన తేదీ మార్పు, మొబైల్ నంబర్ మార్పు, ఇంటిపేరు, గ్రామం పేరు, ఇంటి నంబరు, పింఛను కోసం వేలి ముద్రలు రాకపోవడం, తదితర సమస్యలతో వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు పలు గ్రామాల నుంచి ఏదో ఒక సమస్యతో ఇతర మండలాల్లోని ఆధార్ కేంద్రాలకు తరలివెళ్తున్నారు. అక్కడ రోజంతా పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క రోజులో సమస్య పరిష్కారం కాకపోతే రెండు నుంచి వారం రోజులపాటు తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. సమస్యను జిల్లా అధికారులకు వివరించినా నేటికీ సమస్యను పరిష్కరించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి మండలకేంద్రంలోని ఆధార్ కేంద్రంలో సమస్యను పరిష్కరించి, కేంద్రాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

**అధికారులు స్పందించాలి..**



లింగంపేటలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ఆధార్ కార్డులో ఇంటి నంబరు మార్చుకోవడానికి వారంపాటు కామారెడ్డి, తాడ్వాయి ఆధార్ కేంద్రాలకు తిరిగాను. పనులు మానుకొని ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు సమస్యను పరిష్కరించాలి. – సంతోష్, లింగంపేట

**మూడు రోజులు తిరిగిన..**



నా కుమారుడి ఆధార్ కార్డు కోసం తాడ్వాయి వెళ్లాను. తాడ్వాయిలో కాదని చెప్పడంతో కామారెడ్డికి మూడు రోజులు తిరిగిన. సమయం వృథాతోపాటు డబ్బులు ఖర్చు అయ్యాయి. లింగంపేటలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. –ముకుంద్‌రెడ్డి, అయిలాపూర్

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను**

ఆధార్ సెంటర్‌లో సాంకేతిక లోపం రావడంతో సేవలు నిలిచిపోయాయి. సాంకేతిక లోపం సరిచేయాలని జిల్లా అధికారులకు సమస్య వివరిస్తాను. త్వరలో బాగు చేయించడానికి కృషి చేస్తాను. ఆధార్ సేవల కోసం మండలంలోని చాలా మంది ఇతర మండలాలకు వెళ్తున్నట్లు తెలిసింది. –సురేష్, తహసీల్దార్, లింగంపేట

## నేటి చిత్రం



రాజమ్మ తండా శివారులో గుంతలు పడిన బీటీ రోడ్డు

### కొత్త బీటీ రోడ్డు నిర్మించాలి

రామారెడ్డి: మండలంలోని రాజమ్మ తండాలో బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు మొత్తం గుంతలు పడి ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ తండా నుంచి కొట్టాలపల్లి, దోనకల్, అటు నుంచి నిజామాబాద్ వెళ్లడానికి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ అధ్వాన రోడ్డుతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి వెంటనే పాత బీటి రోడ్డుపై కొత్త బీటీ రోడ్డును నిర్మించాలి. –బన్ని, రాజమ్మ తండా

**మాకు ఫొటో పంపండి**

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

### బోనాల పండుగకు ముస్తాబైన ఆలయాలు

దోమకొండ: మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయం బోనాల పండుగకు ముస్తాబయింది. ఈ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ప్రతియేటా మహంకాళి బోనాల పండుగ తర్వాత వచ్చే ఆదివారం రోజు దుర్గమ్మకు బోనాలు తీయడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది కొత్తగా దోమకొండ పెరిక సంఘం సభ్యులందరూ ఇంటికి ఒక బోనం చొప్పున తీసేందుకు నిర్ణయించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు మర్రి శేఖర్ తెలిపారు.

**ఎల్లారెడ్డిలో..**

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలో నేడు బోనాల పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు ముత్యాల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు బోనాలను సమర్పించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి భక్తులందరూ భారీ సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

# పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలి





సదాశివనగర్‌లో వినతిపత్రం అందజేస్తున్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు.. తాడ్వాయిలో..



లింగంపేటలో..

సదాశివనగర్/తాడ్వాయి/బాన్సువాడ రూరల్/లింగంపేట: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న తమకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే అందించాలని కంప్యూటర్ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సదాశివనగర్, తాడ్వాయి, లింగంపేట సహా పలు మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో వారు అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వేతనాలను పెండింగ్‌లో పెట్టడంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఇట్టి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వేతనాలు చెల్లించడంలో జాప్యం కారణంగా శనివారం విధులు బహిష్కరించినట్లు తెలిపారు.

## ఆధ్యాత్మికం..

### వర్షాల కోసం ప్రత్యేక పూజలు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ముదెల్లి గ్రామానికి చెందిన హనుమాన్ భక్తులు శనివారం వర్షాలు పడాలని కప్పకావడి ఆట ఆడారు. ఓ కర్రకు కప్పను కట్టి అది కనపడకుండా వేప కొమ్మలు కట్టారు. గ్రామంలో ఇంటింటికి తిరిగారు. ప్రతి ఇంటి వద్ద కర్రకు కట్టిన కప్పపై బిందెలతో నీళ్లు పోశారు. కప్పను ఊరేగించారు. అనంతరం ఆలయాల్లో జలాభిషేకం చేశారు.

**పెద్దకొడప్‌గల్‌లో..**

పెద్దకొడప్‌గల్(జుక్కల్): వర్షాలు కురువాలని కోరుతూ మండల కేంద్రంలోని పాపహరేశ్వర ఆలయంలోని శివునికి రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శివలింగం పూర్తిగా మునిగిపోయేలా జలాభిషేకం నిర్వహించారు. మరుసటి రోజు నీటిని తొలగించి పూజలు చేసి, అన్నదానం నిర్వహించనున్నారు.

**టీటీడీలో ప్రత్యేక పూజలు**

బాన్సువాడ రూరల్: బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకుల అప్పారావు, నర్సరాజు, సాయిబాబ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

**హనుమాన్ చాలీసా పారాయణం**

బీబీపేట: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**దుర్గమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ**



దోమకొండ: మండల కేంద్రంలోని దుర్గమ్మ అమ్మవారికి పెరిక సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**వేంకటేశ్వరాలయంలో..**

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ నిర్వహించారు.

**ఘనంగా వైదిక యజ్ఞం**

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని నర్సన్నపల్లి ఆర్‌టీఏ కార్యాలయం వద్ద పబ్బ జగన్నాథం వ్యవసాయ క్షేత్రంలో శనివారం జై హనుమాన్ యోగా కేంద్రం ఆధ్వర్యంలో వైదిక యజ్ఞం, గోపూజ ఘనంగా నిర్వహించారు. యోగాచార్యులు, ఆర్యసమాజ్ సభ్యులు గరపల్లి అంజయ్యగుప్తా, యెల్లంకి సుదర్శన్, మాజీ సర్పంచ్ ద్యాప రాజు, భూపాల్‌రెడ్డి, రాంరెడ్డి, అనిల్‌కుమార్, శ్రీధర్, నర్సింలు ఉన్నారు.

# విద్యాసంస్థల్లో ఘనంగా బోనాల పండుగ



బీర్కూర్ జెడ్పీ పాఠశాలలో..



సదాశివనగర్‌లోని శ్రీ వాణి విద్యాలయంలో బోనాల పండుగ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాకేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలు, కళాశాలల్లో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు నూతన వస్త్రాలను ధరించి బోనాలను తయారు చేసి, అమ్మవారి చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు పోతరాజుల వేషధారణతో ఆకట్టుకున్నారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు బోనాలతో ఊరేగింపు నిర్వహించి, అమ్మవార్లకు సమర్పించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఆషాడ మాసంలో నిర్వహించే బోనాల పండుగ ప్రత్యేకతను వివరించారు. పలు బడుల్లో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మహమ్మద్ నగర్ మోడల్ పాఠశాలలో..



తిమ్మానగర్ ప్రభుత్వ పాఠశాలలో..



కామారెడ్డిలోని జ్యోతీబాపూలే విద్యాలయంలో..



పాల్వంచమర్రి ఆర్ఆర్ పాఠశాలలో..



లింగంపేట బాలికల ప్రాథమిక పాఠశాలలో..



కామారెడ్డిలోని అక్షర స్కూల్‌లో..

## సమాచారం..

**దరఖాస్తుల ఆహ్వానం**

కామారెడ్డి అర్బన్:మైనారిటీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ శిక్షణ కేంద్రంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ సెక్టర్‌పై ఉచిత శిక్షణ కోసం మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ అధికారి దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వచ్చే నెల 18లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా కార్యాలయంలో గాని, 040–23236112లో సంప్రదించాలన్నారు.

**అతిథి అధ్యాపక పోస్టులకు..**

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఇంగ్లీష్, భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, హిందీ, జంతు శాస్త్రం బోధన పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పాసై ఉండాలనీ. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉండాలని అన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 23లోగా దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని అన్నారు. 24న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

**కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు**

బీబీపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ మహిళా కళాశాల/పాఠశాలలోని ఖాళీ సీట్ల భర్తీకి మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రత్యేక అధికారిణి వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 10 సీట్లు, ఎంపీసీలో 9 సీట్లు, 6వ తరగతిలో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థినులు అడ్మిషన్ల కోసం కళాశాలలో సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 70933 3 0151, 9542903230ను సంప్రదించాలన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కరడ్‌పల్లి గ్రామంలో నల్లవెల్లి సంజీవరెడ్డి తండ్రి సాయిరెడ్డి కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని శనివారం జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్ పరామర్శించారు. నాయకులు సుధాకర్‌రావు, బాలార్జున్‌గౌడ్, మోహన్‌రెడ్డి, సాయిలు, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని ముదెల్లి గ్రామానికి చెందిన మున్నూరు కాపు హన్మాండ్లు ఇటీవల పొలంలో విద్యుధాఘాతంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని శనివారం మున్నూరుకాపు మండల కమిటీ అధ్యక్షుడు ఆకుల బాల్‌కిషన్ తదితరులు పరామర్శించారు.

## సంక్షిప్తం

**పాఠశాలకు బెంచీల వితరణ**

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ 2006–07 బ్యాచ్ విద్యార్థులు శనివారం బడికి బెంచీలను అందించారు. ఎంఈవో చందర్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు మహేశ్వరి, ప్రశాంతి, రాజు, స్రవంతి, హసన్ ఉన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన సీఐ**

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును బిచ్కుంద సీఐ రమికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించారు.

**23న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి**

కామారెడ్డి టౌన్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కామారెడ్డి విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు సురేష్, అరుణ్‌కుమార్, శివ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

**ఆలయానికి రూ.50వేల విరాళం**



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న అయ్యప్ప ఆలయానికి శనివారం కామారెడ్డికి చెందిన ఉదయ్ గురుస్వామి రూ. 50వేలు విరాళంగా అందజేశారు. అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు ఎన్గు రమేశ్‌రెడ్డి, ప్రతినిదులు ద్యావర సాయిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనుబాబు, రవీందర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

**కళాశాలకు ఆట వస్తువుల అందజేత**

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శనివారం అధ్యాపకులు ఓంకార్, వినోద్, మేఘరాజ్ క్రీడా సామగ్రిని అందజేశారు. ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు వసంత్‌కుమార్, రాజు, శేషారావ్ ఉన్నారు.

**చిన్నారులకు వైద్య పరీక్షలు**

ఎల్లారెడ్డి: మండలంలోని మల్లయ్యపల్లి గ్రామంలో శనివారం చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పంచాయతి కార్యదర్శి రాజు తెలిపారు. అలాటే టీకాలను వేసినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది శ్రీలత, అంగన్‌వాడి కార్యకర్త తదితరులున్నారు.

**లింగంపేటలో..**

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రాంబాయి తెలిపారు. వైద్య సిబ్బంది ఫరీదా, భాగ్య, ప్రిన్సిపాల్ వెంకట్రాములు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కల్వరాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం లయన్స్ క్లబ్ కామారెడ్డి వారి ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. క్లబ్ జోనల్ చైర్మన్ మారుతి, అధ్యక్షుడు ఆంజనేయులు, సభ్యులు భూపేష్, సురేశ్ పాల్గొన్నారు.